క్లుప్తంగా

శ్యామలకు డాక్టరేట్

నెల్లూరు (అర్బన్): నగరంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకురాలు శ్యామలగారికి డాక్టరేట్‌ను ఎస్వీ వర్సిటీ ప్రదానం చేసింది. జాబ్ శాటిస్ఫాక్షన్ అమాంగ్ ది ఎంప్లాయీస్ ఆఫ్ పబ్లిక్ అండ్ ప్రైవేట్ సెక్టార్ బ్యాంకింగ్ ఆర్గనైజేషన్స్ ఇన్ ఎస్పీఎస్సార్ నెల్లూరు డిస్ట్రిక్ట్ అనే అంశంపై విశ్రాంత ప్రొఫెసర్ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో కామర్స్ విభాగంలో పరిశోధన చేశారు. ఈ క్రమంలో డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఆమెను పలువురు అభినందించారు.

వైద్యుల నిరసన

నెల్లూరు (అర్బన్): రాజస్థాన్‌లో వైద్యులపై ఆ రాష్ట్ర పోలీసులు అమానుషంగా దాడి చేసి లాఠీ చార్జి చేయడంపై బ్లాక్ డేను ఐఎంఏ నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. పలు ఆస్పత్రుల్లో నిరసనలు పాటించారు. ఈ సందర్భంగా ఐఎంఏ రాష్ట్ర నేత అశోక్, నెల్లూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, వెంకటరూపేష్ మాట్లాడారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎమర్జెన్సీ వైద్యసేవలను అందరికీ అందించాలని రాజస్థాన్ ప్రభుత్వం ఆరోగ్య హక్కు చట్టాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. అయితే ఎమర్జెన్సీ వైద్యానికయ్యే ఖర్చును ప్రైవేట్ డాక్టర్లు పెట్టుకోవడం సాధ్యం కాదన్నారు. దీనిపై ప్రజాస్వామికంగా నిరసన తెలియచేస్తున్న డాక్టర్లపై పోలీసులు అమానుషంగా దాడి చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు.

రంగస్థల నటుడికి సత్కారం



నెల్లూరు(బృందావనం): ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని సీనియర్ రంగస్థల నటుడు వెంకటసుబ్బారావును శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీరామరాజు ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. భక్తవత్సలనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మోహన్‌రాజు, రాజేష్‌రాజు, రమేష్‌రాజు, రఘు, నవీన్, తదితరులు పాల్గొన్నారు

కారును ఢీకొన్న బైక్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): అదుపు తప్పిన బైక్ కారును ఢీకొన్న ఘటన నగరంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేటకు చెందిన చైతన్య బైక్‌పై కావలికి బయల్దేరారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై నారాయణ ఇంజినీరింగ్ కళాశాల వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి ముందు వెళ్తున్న కారును వేగంగా ఢీకొన్నారు. ప్రమాదంలో గాయపడిన చైతన్యను ఆస్పత్రికి తరలించారు. నార్త్ ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సర్వేపల్లి కాలువలో మృతదేహం లభ్యం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని సీఆర్పీ డొంక సమీపంలో గల సర్వేపల్లి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నారు. పోలీసుల సమాచారం మేరకు.. సర్వేపల్లి కాలువలో ఓ మృతదేహం లభ్యమైందని పోలీసులకు వీఆర్వో పద్మ తెలియజేశారు. దీంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండొచ్చని భావిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దూషించారంటూ మహిళ ఫిర్యాదు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): తనను దూషించారంటూ పోలీసులకు ఓ మహిళ ఫిర్యాదు చేశారు. వివరాలు.. నవాబుపేటలోని చాకలి వీధిలో వరలక్ష్మి నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఆస్తి విషయమై తడికలబజార్ సెంటర్‌కు చెందిన చెర్రీతో పాటు అతని కుటుంబసభ్యులు సురేఖ, కృష్ణయ్య, సాయి తనను నానా దుర్భాషలాడారని ఆమె ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నవాబుపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ, మినీ వ్యాన్ ఢీ

సంగం: మండలంలోని దువ్వూరు వద్ద జాతీయ రహదారిపై సోమవారం మినీ వ్యాన్, లారీ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. కర్ణాటక వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న మినీ వ్యాన్ డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ఎదురుగా వస్తున్న లారీని ప్రమాదవశాత్తు ఢీకొంది. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రసన్నుడి గరుడసేవలో భక్తులకు అవకాశం

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో ప్రతి పౌర్ణమి రోజున నిర్వహించే ప్రసన్న వేంకటేశ్వరస్వామి ప్రత్యేక గరుడ సేవకు ఉభయకర్తలను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ పాలక మండలి చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులందరికీ స్వామి వారి సేవా భాగ్యం కల్పించాలనే లక్ష్యంతో ప్రతి నెలా పౌర్ణమి రోజున ప్రత్యేక గరుడ సేవ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో నెల ఒకో భక్తుడికి ఉభయకర్తగా అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన ఉభయకర్తలు ఆలయ కార్యనిర్వహణాధికారిని సంప్రదించాలని సూచించారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు(విడవలూరు): గత టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని, నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో ప్రతిఇంటా సంక్షేమ వెలుగులు నిండుతున్నాయని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. విడవలూరు మండలం రామతీర్థంలోని పాతూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామతీర్థంలోని 1441 కుటుంబాలకు గానూ వివిధ పథకాల రూపంలో రూ.12.89 కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా ఎన్నో సంక్షేమ పథకాలను మన ప్రభుత్వం అమలు చేయడం గొప్ప విషయమన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకుంటేనే సంక్షేమ పథకాలు అందేవని గుర్తుచేశారు. ప్రస్తుతం సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు.

మహిళలను మోసం చేసిన ఘనుడు బాబు

సృష్టికి మూలమైన మహిళలను మోసం చేసిన ఘనుడు చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాల్లో భాగంగా రామతీర్థంలో పొదుపు మహిళలతో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. 2014 ఎన్నికలకు ముందు పొదుపు రుణాలను మాఫీ చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన బాబు పొదుపు మహిళలను మోసం చేశారన్నారు. అలాంటి వ్యక్తి మళ్లీ ప్రజలకు కల్లబొల్లి మాటలు చెబుతూ మభ్యపెట్టేందుకు పచ్చపత్రికల ద్వారా యత్నిస్తున్నారన్నారు. అటువంటి వ్యక్తికి మరో చెంప దెబ్బ చెల్లించేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు పొదుపు మహిళలను ఆదుకుంటున్నారన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద జిల్లాలోని పొదుపు మహిళల ఖాతాల్లో మూడు విడతల్లో రూ.110 కోట్లు జమ చేశారని వివరించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

రామతీర్థం పాతూరుకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు 50 మంది ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వనమాల జనార్దన్‌రావు మాట్లాడుతూ ఆవుల వాసు సూచనల మేరకు వైఎస్సార్‌సీపీలో చేరడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, విడవలూరు మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ భవానీ, ఏఎంసీ మాజీ చైర్మన్లు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, కొండూరు వెంకటసుబ్బారెడ్డి, ముదివర్తి, వరిణి సొసైటీల చైర్మన్లు లక్ష్మీనారాయణరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ భవానీ, యువజన విభాగం సభ్యులు ఆవుల వాసు, సర్పంచ్ సుజన, ఎంపీటీసీ సభ్యులు రమణమ్మ, బుచ్చింగారి తిరుపతి, మాజీ ఎంపీపీ ఓగు నాగేశ్వరరావు, తాతా ప్రభాకర్, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

పొదలకూరు : పట్టణ సమీపంలో సంగం–పొదలకూరు రోడ్డుపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు.స్థానికుల వివరాల మేరకు..రత్నగిరికి చెందిన జీ శ్రీనివాసులు మోటార్‌సైకిల్‌పై పొదలకూరుకు వచ్చి తిరి స్వగ్రామానికి వెళుతున్నాడు. ఈ క్రమంలో రైస్‌మిల్లు సమీపంలో అదుపుతప్పి ముందు వెళ్తున్న వృద్ధుడి మోటార్‌సైకిల్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు అదుపు తప్పి రోడ్డుపై పడడంతో తలకు తీవ్రగాయమైంది. వృద్ధుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. శ్రీనివాసులును 108 సిబ్బంది నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మెడికవర్ ఆస్పత్రికి తరలించారు.



తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులు

చిన్నారులకు బాండ్ల అందజేత

కోవూరు: పడుగుపాడులోని చంద్రమౌళీనగర్ గిరిజన కాలనీలో వలంటీర్‌గా పనిచేస్తూ మృతి చెందిన కొమరగిరి అఖిల కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి రూ.5 లక్షలు చెక్కు మంజూరైన విషయం తెలిసిందే. ఈ నిధులను పడుగుపాడు సొసైటీలో అఖిల కుమారులు భవేష్, ధన్వేష్ పేర్లపై డిపాజిట్ చేసి అందుకు సంబంధించిన బాండ్లను వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కుటుంబ సభ్యులకు డీఏఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి సోమవారం అందజేశారు. ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచన మేరకు చిన్నారుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వారి పేర్లపై నగదును డిపాజిట్ చేసి బాండ్లు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఏఎంసీ చైర్మన్ పీ రాధాకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎన్ సుబ్బారెడ్డి, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, పడుగుపాడు సర్పంచ్ లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ అహమ్మద్, చిరంజీవి, ప్రసాద్, సాయి, తదితరులు పాల్గొన్నారు.



బాండ్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పన్నుల వసూళ్లకు స్పెషల్‌డ్రైవ్

మనుబోలు: మండలంలోని పలు పంచాయతీల్లో పన్నుల వసూళ్లకు అధికారులు సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈఓపీఆర్డీ పుట్టా రమణయ్య ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి తిరిగి పన్నులు వసూలు చేశారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ మరో మూడ్రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున పన్నుల వసూళ్లను వేగవంతం చేసినట్లు తెలిపారు. పన్ను వసూళ్లలో జిల్లాలో మనుబోలు మండలం ఆరో స్థానంలో వుందని తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో 86 శాతం మేర పన్నులు వసూలు చేశామని వివరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణయ్య, చెంచుప్రసాద్, బిల్ కలెక్టర్ శ్రీహరి ఉన్నారు.



ఇంటి పన్ను వసూలు చేస్తున్న అధికారులు

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి

పొదలకూరు : ఎస్సీ వర్గీకరణ బిల్లును బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర నాయకుడు మందా పెంచలయ్యమాదిగ డిమాండ్ చేశారు. మండలంలోని నావూరు, నావూరుపల్లి, అమ్మవారిపాళెంలో గ్రామాల్లో రెండో విడత మాదిగల మహాసంగ్రామ పాదయాత్రను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 ఏళ్ల క్రితం పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెడతామని హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం నేటికి ప్రవేశపెట్టకుండా హామీని విస్మరించిందని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు కోసం ఈ నెల 31న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కోలగల్ల రమేష్‌మాదిగ, అలుపూరు పాపయ్యమాదిగ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు మనీషా, తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేపడుతున్న నాయకులు

ఫ్యామిలీ డాక్టర్ సేవలు



కొడవలూరు: చంద్రశేఖరపురంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ సేవలందించారు. కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం రామకృష్ణ ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఆరోగ్య సలహాలు అందజేశారు. అనంతరం గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గర్భిణుల ఇళ్లకు వెళ్లి పరీక్షించి ఆరోగ్య జాగ్రత్తలను సూచించారు. ఏఎస్‌ఎం రాధమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ పద్మజ, హెచ్‌ఏ సుధాకర్, ఆశాకార్యకర్త కల్పన పాల్గొన్నారు.

ముత్తుకూరు జెడ్పీటీసీకి పరామర్శ

నెల్లూరు (పొగతోట): ముత్తుకూరు జెడ్పీటీసీ సభ్యుడు వెంకటరమణయ్య సతీమణి వెంకటరమణమ్మ మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పరామర్శించారు. వారి నివాసానికి సోమవారం వెళ్లి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



నేటి నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

తోటపల్లిగూడూరు: మండలంలోని మేజర్ పంచాయతీ కోడూరులో మంగళవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు కావలిరెడ్డి రంగారెడ్డి సోమవారం తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ

పొదలకూరు : పట్టణంలోని విజేత పాఠశాలలో సరస్వతిపూజను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పదోతరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు ప్రసాదించాలని వేడుకున్నారు. కరస్పాండెంట్ జీ కామాక్షి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ

పొదలకూరు : పొదుపు సభ్యుల రుణమాఫీకి సంబంధించి వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం ఉదయం 10 గంటలకు పంపిణీ చేయనున్నట్లు వైకేపీ ఏపీఎం రోజ్‌మేరీ సోమవారం తెలిపారు. పొదలకూరులోని ద్వారకామయి కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమానికి పొదుపు మహిళలు హాజరు కావాలని కోరారు.

స్పందనకు రెండు వినతులు



బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి రెండు వినతులు అందాయి. ఇంటి పన్ను సమస్యను పరిష్కరించాలని, నివేశన స్థలం మంజూరు చేయాలని ఇరువురు చైర్‌పర్సన్ మోర్ల సుప్రజకు వినతులు అందజేశారు. స్పందించిన ఆమె సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

స్పీడ్ లేజర్ గన్‌తో స్పెషల్ డ్రైవ్



సంగం: మండలంలోని పెరమన క్రాస్ రోడ్డు వద్ద సోమవారం జాతీయ రహదారిపై స్పీడ్ లేజర్ గన్‌తో ఆత్మకూరు డీఎస్పీ ఎస్.కోటారెడ్డి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓవర్ స్పీడ్‌తో వస్తున్న వాహనాలను స్పీడ్ లేజర్ గన్ ద్వారా గుర్తించి చలానాలు విధించారు. ఆయన వెంట ఎస్సై నాగార్జునరెడ్డి ఉన్నారు.

మంత్రి కాకాణికి సన్మానం



మంత్రి కాకాణిని సత్కరించి వరి కంకుల గుచ్ఛం అందజేస్తున్న దువ్వూరు

ముత్తుకూరు: మండలంలోని పచ్చికాయలమిట్ట రోడ్డు ప్రారంభానికి సోమవారం వచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి స్థానిక వైఎస్సార్‌సీపీ నేత దువ్వూరు చంద్రశేఖరరెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి ఎకరాకు ఐదు పుట్ల మేర ధాన్యం దిగుబడి వచ్చిన పొలంలోని వరి కంకులతో తయారు చేసిన గుచ్ఛాన్ని అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రబీలో పంట దిగుబడులు బాగా రావడంతో పాటు రైతులకు మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభిస్తోందని సంతోషం వెలిబుచ్చారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.85 కోట్లు

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి అమృత్ 2.0 పథకం కింద రూ.85 కోట్లు మంజూరైనట్లు నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చొరవతో నగర పంచాయతీ ప్రజల దాహార్తిని తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమృత్ పథకం కింద నిధులు మంజూరు చేశాయని తెలిపారు. అమృత్ పథకానికి నగర పంచాయతీ వాటా కింద రూ.6.52 కోట్లను నిర్వహణ ఖర్చు కింద చెల్లించాల్సి ఉందన్నారు. అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణానికి రూ.30 లక్షల మంజూరు చేయనున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించిన తీర్మాలతో కలిపి మొత్తం 20 తీర్మానాలను ప్రవేశ పెట్టగా కౌన్సిల్ సభ్యులు ఆమోదించారని కమిషనర్ వివరించారు. ఈ సమావేశం వైస్‌చైర్‌పర్సన్లు కోటంరెడ్డి లలితారెడ్డి, షేక్ షాహుల్, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



తీర్మానాలను చదువుతున్న కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, పక్కన చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ

పౌష్టికాహారంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఎం జ్యోతిలక్ష్మి

పొదలకూరు : గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అవసరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం జ్యోతిలక్ష్మి సూచించారు. పట్టణంలోని నర్సారెడ్డికాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ చిరుధాన్యాలతో కూడిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. రక్తహీనతను అధిగమించేందుకు పౌష్టికాహారాన్ని తీసుకోవా లని సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

ఆర్చి నిర్మాణ పనుల పరిశీలన

కోవూరు: మండలంలోని పోతిరెడ్డిపాళెంలో వారధి సెంటర్ వద్ద ఆర్చి నిర్మాణ పనులను సర్పంచ్ నలుబోలు శ్రీవాణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నలుబోలు సుబ్బారెడ్డి సోమవారం పరిశీలించారు. ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంతో ఆర్చి నిర్మాణ పనులు చేపడుతున్నట్లు వారు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణ పనులను పూర్తి చేస్తామన్నారు. వారి వెంట గాజుల మల్లికార్జున, ఆదిరెడ్డి అపర్ణ, అల్లం రాజ, ఉపసర్పంచ్ చల్లా వెంకటేశ్వర్లు, గాజుల సుజని, జానా వెంకటేశ్వర్లు , అల్లం రత్నమ్మ, పొంగూరు చిన్నా, తదతరులు ఉన్నారు.



సుబ్బారావు మృతికి నివాళి

తోటపల్లిగూడూరు: మండలంలోని మండపం పంచాయతీ సర్పంచ్ కాల్తిరెడ్డి సుబ్బారావు తండ్రి కాల్తిరెడ్డి సుబ్బరామయ్య(95) ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం సందర్శించి నివాళులర్పించారు. సుబ్బారావు కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంత్రి వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, నాయకులు మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, నెల్లూరు శివప్రసాద్, తదితరులు ఉన్నారు.

వరికోత యంత్రాలకు డిమాండ్



పొదలకూరు : అకాల వర్షాల భయంతో రైతులు ఒక్కసారిగా కోతలకు దిగడంతో వరికోత యంత్రాలకు డిమాండ్ ఏర్పడింది. ఇటీవల మండలంలో కురిసిన అకాల వర్షానికి వరి రైతులు అతలాకుతలం అయ్యారు. భారీ స్థాయిలో నష్టం వాటిల్లకున్నా పంట నేలవాలి ధాన్యం ధరలు స్వల్పంగా తగ్గాయి. మండలంలో 10,500 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. మార్చి నెలాఖరుకు 70 శాతం వరికోతలు పూర్తి చేయాల్సి ఉంది. వర్ష సూచనలతో వరికోత యంత్రాల కోసం రైతులు పరుగులు తీస్తున్నారు. యంత్రాలు సకాలంలో లభ్యం కాకపోవడంతో వర్షం కురిస్తే చేతికి అందిన పంట నేలపాలవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెన్నై, తిరుపతి, తెలంగాణ ప్రాంతాల నుంచి యంత్రాలు వస్తున్నాయి. స్థానికంగా కొందరు యంత్రాలను కొనుగోలు చేసి ఏర్పాటు చేస్తున్నారు.

రైతుల అవసరాలకు అనుగుణంగా బాడుగ

సాధారణంగా వరికోత యంత్రాలు రెండు రకాలుగా ఉంటాయి. చైన్ యంత్రం నేలతేమగా ఉన్నా కోతలు చేపడుతుంది. ఈ యంత్రానికి గంటకు రూ.2,200 బాడుగ వసూలు చేస్తున్నారు. టైర్ల యంత్రానికి గంటకు రూ.1,800 తీసుకుంటున్నారు. ఆకాశం మేఘావృతమై చైన్‌యంత్రానికి రూ.2,400, టైర్ల యంత్రానికి రూ.2 వేల వరకు వసూలు చేస్తున్నట్టు రైతులు చెబుతున్నారు. డిమాండ్ చేసిన మేర బాడుగ అందజేసేందుకు సిద్ధమైన సకాలంలో యంత్రాలు అందుబాటులో ఉండడం లేదని వాపోతున్నారు.